

RNI: APTEL/2010/36742

# న్యూస్ వార్
వార్తా పత్రిక

TELANGANA RISING GLOBAL SUMMIT

నల్లగొండ | epaper.news war.com | ఆదివారం 5, ఏప్రిల్ 2026 | సంపుటి :16 సంచిక :17 | ఎడిటర్: నటవా కృష్ణారావు | పేజీలు : 4 , వెల.2.00

# బాసర ఆలయ అభివృద్ధి అద్భుతంగా ఉండాలి..

- మాస్టర్ ప్లాన్‌పై అధికారులకు పలు సూచనలు
- శాస్త్ర ప్రకారం ఆలయ అభివృద్ధి
- విశాలమైన రోడ్లు ఉండేలా చర్యలు
- ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా నిబంధనలు కఠినతరం
- రూ.225 కోట్లతో ఆలయ అభివృద్ధి
- అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం



బాసర ఆలయ అభివృద్ధిపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి( ఈరోజు(శనివారం) సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బాసర ఆలయ అభివృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను సీఎంకు అధికారులు వివరించారు. మాస్టర్ ప్లాన్‌పై అధికారులకు పలు సూచనలు చేశారు సీఎం. ఆలయ అభివృద్ధి అద్భుతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భక్తుల విశ్వాసాలను గౌరవిస్తూ, శాస్త్ర ప్రకారం ఆలయ అభివృద్ధి ఉండాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలను, రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాలమైన రోడ్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

వార్త 2లో






## పుదుచ్చేరి రాష్ట్ర హోదాకు టీవీకే కృషి: విజయ్

కేంద్రంలో ఏళ్ల తరబడి అధికారంలో ఉన్నప్పటికీ పుదుచ్చేరి కి రాష్ట్ర హోదా కల్పించడంలో జాతీయ పార్టీలు విఫలమయ్యాయని బీజేపీ, కాంగ్రెస్‌పై టీవీకే చీఫ్ విజయ్ విమర్శలు గుప్పించారు. పుదుచ్చేరికి చట్టబద్ధంగా పూర్తి స్థాయి రాష్ట్ర హోదా సాధించేందుకు టీవీకే నూటికి నూరు శాతం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు.

వార్త 2లో




## ఖానాపూర్ చైర్మన్ ఎన్నిక వాయిదా.. బీజేపీ, బీఆర్ఎస్ సీరియస్

జిల్లాలో ఉత్కంఠ రేపిన ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక వాయిదా వేయడంపై బీజేపీ, బీఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహించారు. ఖానాపూర్ మున్సిపల్ కార్యాలయంలోనే బైఠాయించి ఆందోళనకు దిగారు.

వార్త 2లో



## క్యాంపు కార్యాలయంపై దాడిని పోలీసులు ఎందుకు అడ్డుకోవట్లేదు? : హరీశ్ రావు

వార్త 2లో

## ట్రంప్ నియంత్రణలో మోదీ, ఆయన నియంత్రణలో పినరయి...



### రాహుల్ విసుర్లు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ( మరోసారి విమర్శలు గుప్పించారు. నరేంద్ర మోదీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నియంత్రణలో ఉన్నారని, అత్యంత అవమైనకరమైన విషయం ఏమిటంటే ట్రంప్‌ను 'సర్' అని ఆయన పిలుస్తారని చెప్పారు. మోదీ ఇంకా బ్రిటిష్ కాలంలో ఉన్నానని అనుకుంటున్నారని విమర్శించారు. మోదీని ట్రంప్ నియంత్రిస్తున్నట్టే పినరయి విజయన్‌ను మోదీ నియంత్రిస్తున్నారని అన్నారు. కేరళంలోని ఇడుక్కిలో శనివారంనాడు జరిగిన ఎన్నికల ప్రచారసభలో రాహుల్ మాట్లాడుతూ, బీజేపీతో లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ కుమ్మక్కయిందని ఆరోపించారు.

## అమెరికాకు దెబ్బ మీద దెబ్బ..

యూఎస్ ఎమ్‌క్యూ -1 డ్రోన్‌ను కూల్చేసిన ఇరాన్..

వార్త 2లో



## సీఐడీ ముందుకు పాడి కౌశిక్ రెడ్డి.. విచారణ ప్రారంభం

బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సీఐడీ ముందు విచారణకు హాజరయ్యారు. ఈరోజు(శనివారం) హైదరాబాద్‌లోని సీఐడీ కార్యాలయానికి ఎమ్మెల్యే చేరుకున్నారు. కౌశిక్ రెడ్డితో పాటు ఆయన సతీమణికి కూడా సీఐడీ నోటీసులు ఇచ్చింది. దీంతో ఎమ్మెల్యే భార్య కూడా సీఐడీ విచారణకు హాజరయ్యారు. ఎమ్మెల్యేను సీఐడీ డీఎస్పీ రంగస్వామి విచారిస్తున్నారు. జనవరి 29న సమక్క - సారలమ్మ జాతర సందర్భంగా హుజురాబాద్‌లో కౌశిక్ రెడ్డి రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేసిన విషయం తెలిసిందే. దీంతో శాంతిభద్రతలకు విఘాతం కలిగించారంటూ ఎమ్మెల్యేపై కేసు నమోదు అయ్యింది. కౌశిక్ రెడ్డికి సీఐడీ అధికారులు నోటీసులు జారీ చేశారు.



## రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేయాలని రేవంత్ రెడ్డి చూస్తున్నారు: సబితా

హైదరాబాద్:



వాయిదా పడ్డ మున్సిపాలిటీలలో ప్రజాస్వామ్యం గెలిచిందని బిఆర్ఎస్ మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. మూడు మున్సిపాలిటీలను కాంగ్రెస్ కోటాలో వేసుకోవాలని విశ్వప్రయత్నం చేశారని అన్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ఎవరెన్ని ప్రలోభాలకు పెట్టినా బిఆర్ఎస్ వైపు నిలిచిన కౌన్సిలర్లకు, కాంగ్రెస్ ప్రలోభాలకు ప్రజలు లొంగకుండా బిఆర్ఎస్ ను ఓట్లేసి గెలిపించారని, ఎన్నికల వరకు తీసుకొచ్చిన మంచిరెడ్డి ప్రశాంత్ రెడ్డికి ధన్యవాదాలు సబితా ఇంద్రారెడ్డి తెలియజేశారు. అసెంబ్లీలో సిఎం రేవంత్ రెడ్డి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని, రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేయాలని రేవంత్ రెడ్డి చూస్తున్నారని విమర్శించారు. గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసుపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని డిమాండ్ చేశారు. తెలంగాణ తల్లి కన్నీళ్లు పెట్టుకుంటోందని ఎద్దేవా చేశారు.



## ప్రైవేటు వ్యక్తులతో కలిసి సీఎం భూములు దోచుకుంటున్నారు : ఎంపీ ఈటల

# ట్రంప్ నియంత్రణలో మోదీ, ఆయన నియంత్రణలో పినరయి... రాహుల్ విసుర్లు

ఇడుక్కి: న్యూస్‌వార్ ప్రతినిధి

ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ( మరోసారి విమర్శలు గుప్పించారు. నరేంద్ర మోదీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నియంత్రణలో ఉన్నారని, అత్యంత అవమైనకరమైన విషయం ఏమిటంటే ట్రంప్‌ను 'సర్' అని ఆయన పిలుస్తారని చెప్పారు. మోదీ ఇంకా బ్రిటిష్ కాలంలో ఉన్నానని అనుకుంటున్నారని విమర్శించారు. మోదీని ట్రంప్ నియంత్రిస్తున్నట్టే పినరయి విజయన్‌ను మోదీ నియంత్రిస్తున్నారని అన్నారు. కేరళంలోని ఇడుక్కిలో శనివారంనాడు జరిగిన ఎన్నికల ప్రచారసభలో రాహుల్ మాట్లాడుతూ, బీజేపీతో లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ కుమ్మక్కయిందని ఆరోపించారు. 'బీజేపీ, ఆర్ఎస్ఎస్, లెఫ్ట్ ఫ్రంట్ మధ్య సంబంధాలను ఇవాళ ప్రతి ఒక్కరూ చూడొచ్చు. లెఫ్ట్ ఫ్రంట్‌లో సిద్ధాంతాల కోసం ఎళ్లతరబడి పనిచేసిన అవకాశవాదులు కాని కొందరు ఇప్పుడు తమను పార్టీ వంచించిందని ఆవేదన చెందుతున్నారు' అని రాహుల్ తెలిపారు. బీజేపీ-ఆర్ఎస్ఎస్‌తో కుమ్మక్కయినందునే ఎల్‌డీఎఫ్ తన వామపక్ష భావజాలాన్ని కోల్పోయిందన్నారు. కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ ఎప్పుడూ సైద్ధాంతిక ప్రత్యర్థిగా ఎల్‌డీఎఫ్‌తో పోరాడేదని, ఇప్పుడు ఎల్డీఎఫ్ మారిపోయిందని, ఎల్‌డీఎఫ్‌లో 'లెఫ్ట్' అనేదే లేదని, ఎన్నికల తర్వాత అందులో ఏదీ మిగలదని అన్నారు.కేరళలోని ప్రభుత్వాన్ని ఒక చీకటి శక్తి ప్రభావితం చేస్తోందని, అది రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ ప్రజలపై దాడి చేస్తోందని పరోక్షంగా బీజేపీ-ఆర్ఎస్ఎస్‌పై రాహుల్ విమర్శలు గుప్పించారు. ప్రధానమంత్రి మోదీ ఏ రాష్ట్రానికి వెళ్లిగా మతం, ఆలయాలు గురించి మాట్లాడతారని, కేరళ అంశాల విషయానికి వచ్చేసరికి మాత్రం పెదవి విప్పరని శబరిమల బంగారం కేసును ప్రస్తావిస్తూ అన్నారు. ఎల్‌డీఎఫ్‌కు హెల్ప్ చేయాలని ఆయన అనుకోవడమే అందుకు కారణమని వివరించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌తో పోరాడుతున్నందున తనపై చాలా కేసులు పెట్టారని, ఇంటరాగేట్ చేశారని, అయినా కూడా తాను వెనుదీయలేదని చెప్పారు. మోదీ ప్రతిరోజూ తనపై విమర్శల దాడి చేస్తారని, కానీ కేరళ సీఎం గురించి కానీ, ఆయన కుటుంబం గురించి కానీ ఒక్క మాట మాట్లాడరని అన్నారు. జాతీయ అంశాలపై మోదీని ఎల్డీఎఫ్ ఎప్పుడూ సవాలు చేయకపోవడమే ఇందుకు కారణమని అన్నారు. ఏప్రిల్ 9న కేరళ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

# పుదుచ్చేరి రాష్ట్ర హోదాకు టీవీకే కృషి: విజయ్

పుదుచ్చేరి: న్యూస్‌వార్ ప్రతినిధి

కేంద్రంలో ఏళ్ల తరబడి అధికారంలో ఉన్నప్పటికీ పుదుచ్చేరి కి రాష్ట్ర హోదా కల్పించడంలో జాతీయ పార్టీలు విఫలమయ్యాయని బీజేపీ, కాంగ్రెస్‌పై టీవీకే చీఫ్ విజయ్ (ఎఱఆయిఖఎ) విమర్శలు గుప్పించారు. పుదుచ్చేరికి చట్టబద్ధంగా పూర్తి స్థాయి రాష్ట్ర హోదా సాధించేందుకు టీవీకే నూటికి నూరు శాతం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా శనివారంనాడిక్కడ జరిగిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. పుదుచ్చేరిలోని డీఎంకే-కాంగ్రెస్ కూటమిని 'అయోమయ కూటమి'గా విజయ్ అభివర్ణించారు. ఏఐఎన్ఆర్‌సీ-బీజేపీ కూటమి శక్తిహీనంగా మారిందని చెప్పారు. టీవీకే విజిల్ గుర్తుకు ఓటు వేసి తమ పార్టీగా మద్దతుగా నిలవాలని, కేవలం ఒక్క వేలితో రాజకీయ మార్పు (వన్ ఫింగర్ రివల్యూషన్) తీసుకురా వాలని ప్రజలను కోరారు. తమ పార్టీ అభ్యర్థులు ప్రజలకు అండగా నిలబడతారని తెలిపారు. టీవీకే అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు.

### రూ.25 లక్షల ఆరోగ్య బీమా

టీవీకే అధికారంలోకి వస్తే ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల ఆరోగ్య బీమా కల్పిస్తామని, పేదరికపు రేఖకు దిగువనున్న ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ అందిస్తామని చెప్పారు. పుదుచ్చేరి యూనివర్శిటీ ఆఫ్ అప్లైడ్ సైన్సెస్ అండ్ ఆర్ట్స్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. పుదుచ్చేరి అబివృద్ధికి కట్టుబడి ఉంటామని, సురక్షితమైన, పారదర్శక పాలనను అందిస్తామని విజయ్ హామీ ఇచ్చారు. పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 9న జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

# అమెరికాకు దెబ్బ మీద దెబ్బ..

### యూఎస్ ఎమ్‌క్యూ -1

### డ్రోన్‌ను కూల్చేసిన ఇరాన్..

టెహ్రాన్, న్యూస్‌వార్ ప్రతినిధి

ఇరాన్ - ఇజ్రాయెల్, అమెరికా దేశాల మధ్య యుద్ధం మరింత పెరుగుతోందే కానీ, తగ్గటం లేదు. ఇజ్రాయెల్, అమెరికాలు ఇరాన్‌పై విరుచుకుపడుతు న్నాయి. ఇరాన్‌ను ఆర్థికంగా దెబ్బతీసే విధంగా దాడులు చేస్తున్నాయి. ఇరాన్ ఏమాత్రం వెనక్కు తగ్గటం లేదు. రెండు దేశాలకు గట్టిపోటీ ఇస్తోంది. ఇజ్రాయెల్, అమెరికాలపై పెద్ద ఎత్తున దాడులు చేస్తోంది. ఆ దేశాల దాడులను సమర్థవంతంగా అడ్డుకుంటోంది. ఈ నేపథ్యంలోనే అమెరికాకు చెందిన రెండు ఫైటర్ జెట్‌లను శుక్రవారం కూల్చేసింది.అమెరికాకు చెందిన అమెరికన్ ఏ -10 యుద్ధ విమానాన్ని ఇరాన్ కూల్చేసింది. శుక్రవారం స్ట్రెట్ ఆఫ్ హోర్ముజ్ దగ్గర అమెరికన్ ఏ-10 యుద్ధ విమానాన్ని ఇరాన్ కూల్చేసిందని తస్నిమ్ న్యూస్ ఏజెన్సీ తెలిపింది. అమెరికన్ ఏ -10తో పాటు ఎఫ్15-ఈ స్టెక్ ఈగిల్ యుద్ధ విమానాన్ని కూడా ఇరాన్ కూల్చేసింది. తాజాగా, అమెరికాకు చెందిన ఎమ్‌క్యూ-1 డ్రోన్‌ను ఇరాన్ కూల్చేసింది. ఇస్ఫహాన్ ప్రావిన్స్‌లో ఎమ్‌క్యూ-1 డ్రోన్‌ను అడ్వాన్స్‌డ్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ సాయంతో ఐఆర్‌జీసీ కూల్చేసిందని ఇరాన్‌కు చెందిన ఫార్స్ న్యూస్ ఏజెన్సీ తెలిపింది.

# ఖానాపూర్ చైర్మన్ ఎన్నిక వాయిదా.. బీజేపీ, బీఆర్ఎస్ సీరియస్

నిర్మల్ జిల్లా: జిల్లాలో ఉత్కంఠ రేపిన ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక వాయిదా వేయడంపై బీజేపీ, బీఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహించారు. ఖానాపూర్ మున్సిపల్ కార్యాలయంలోనే బైఠాయించి ఆందోళనకు దిగారు. బీజేపీ కౌన్సిలర్ అభ్యర్థిని చైర్మన్‌గా ఎన్నుకోవడానికి సరిపడా కోరం ఉన్నప్పటికీ.. ఎన్నికను అధికారులు వాయిదా వేయడంపై మండిపడుతున్నారు. దీంతో ఆగ్రహించిన ఇరుపార్టీల కౌన్సిలర్లు, నేతలు, కార్యకర్తలు నిరసనకు దిగారు. వారికి మద్దతుగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితీశ్ రాథోడ్, బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ జాన్సన్ నాయక్ ఆందోళనలో పాల్గొన్నారు.జిల్లా కలెక్టర్ వచ్చి ఖానాపూర్ మున్సిపల్ ఎన్నికను నిర్వహించాలని, లేదంటే చనిపోయే వరకూ ఇక్కడే కూర్చుంటామని వారు తేల్చి చెప్పారు. అలా కాకుంటే హైదరాబాద్ ఎన్నికల సంఘం వద్ద ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక నిర్వహించాలని డిమాండ్ చేశారు. కౌన్సిల్ సభ్యులకు అధికారులు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా చైర్మన్ ఎన్నిక ఎలా వాయిదా వేస్తారని కౌన్సిలర్లు ప్రశ్నిస్తున్నారు. ఈ నిరసన కారణంగా తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో ఖానాపూర్ 8వ వార్డు బీజేపీ కౌన్సిలర్ బొప్పారావు సత్యవతి కళ్లు తిరిగి పడిపోయారు. ఆమెను తోటి కౌన్సిలర్లు అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.ఖానాపూర్ మున్సిపల్ ఎన్నిక వాయిదా పడినప్పటికీ నేడు మరో రెండు మున్సిపాలిటీలకు ఎన్నికలు సజావుగా జరిగాయి. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీని బీఆర్ఎస్- సీపీఐ కూటమి దక్కించుకుంది. చైర్‌పర్సన్‌గా బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ గుడిసెల సంధ్యారాణి ఎన్నిక కాగా.. వైస్ చైర్‌పర్సన్‌గా సీపీఐ అభ్యర్థి సరిత ఏకగ్రీవం అయ్యారు. కాంగ్రెస్ పార్టీకి బలం లేకపోవడంతో ఎన్నికకు దూరంగా ఉంది. అలాగే రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపల్ పీఠాన్ని బీఆర్ఎస్, బీజేపీ కైవసం చేసుకున్నాయి. చైర్మన్‌గా బీఆర్ఎస్ అభ్యర్థి టేకుల సుదర్శన్ రెడ్డి, వైస్ చైర్‌పర్సన్‌గా బీజేపీ అభ్యర్థి శ్యామల ఎన్నికయ్యారు.

# బాసర ఆలయ అభివృద్ధి అద్భుతంగా ఉండాలి..

మాస్టర్ ప్లాన్‌పై అధికారులకు పలు సూచనలు

శాస్త్ర ప్రకారం ఆలయ అభివృద్ధి

విశాలమైన రోడ్లు

ఉండేలా చర్యలు

ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా నిబంధనలు కఠినతరం

రూ.225 కోట్లతో

ఆలయ అభివృద్ధి

అధికారులకు సీఎం

రేవంత్ ఆదేశం



హైదరాబాద్, న్యూస్‌వార్ ప్రతినిధి

బాసర ఆలయ అభివృద్ధిపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి( ఈరోజు(శనివారం) సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బాసర ఆలయ అభివృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను సీఎంకు అధికారులు వివరించారు. మాస్టర్ ప్లాన్‌పై అధికారులకు పలు సూచనలు చేశారు సీఎం. ఆలయ అభివృద్ధి అద్భుతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భక్తుల విశ్వాసాలను గౌరవిస్తూ, శాస్త్ర ప్రకారం ఆలయ అభివృద్ధి ఉండాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలను, రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాలమైన రోడ్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆలయ పరిసరాల్లో ఈవీ వాహనాలను మాత్రమే వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా నిబంధనలు కఠినతరం చేయాలని ఆదేశించారు. తిరుమల తరహాలో అన్ని ఆలయాల పరిసరాల్లో ఎలాంటి రాజకీయ కార్యకలాపాలు జరగకుండా నిబంధనలు ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశానికి మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ నెల 6న బాసర ఆలయ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. రూ.225 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు.

# ప్రైవేటు వ్యక్తులతో కలిసి సీఎం భూములు దోచుకుంటున్నారు: ఎంపీ ఈటల

వరంగల్: న్యూస్‌వార్ ప్రతినిధి

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఆరు గ్యారెంటీలు, ఫీజురీయింబర్స్‌మెంట్ సహా పలు అంశాలపై సీఎంకు ప్రశ్నలు సంధించారు. తెలంగాణ ప్రజల సంపదను రేవంత్ రెడ్డి కొళ్లగొడుతున్నారని ఈటల రాజేందర్ ఆరోపణలు గుప్పించారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల కోసం రాష్ట్ర ప్రజల సంపదను తరలిస్తున్నారని మండిపడ్డారు.తెలంగాణ ఎన్నికల వేళ ఆరు గ్యారంటీలు- 66 హామీల పేరుతో ప్రజలను ఆయన మోసం చేశారని ఎంపీ ఈటల ఆగ్రహించారు. రాష్ట్ర ప్రజానీకం గంపెడు ఆశలతో కాంగ్రెస్‌కు అధికారం కట్టబెడితే.. చట్ట సభల్లో ప్రజా సమస్యలు చర్చకు రాకుండా వ్యక్తిగత దూషణలతో కాలం వృథా చేశారని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2023 నుంచి ఫీజురీయింబర్స్‌మెంట్ ఇవ్వలేదని.. కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర ఏళ్లలో రూ.600 కోట్లు మాత్రమే విడుదల చేసిందని ధ్వజమెత్తారు. పేద విద్యార్థుల జీవితాలతో రేవంత్ రెడ్డి సర్కార్ చెలగాటం ఆడుతోందని ఆగ్రహించారు ఈటల.రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీల అమలు ఎలా సాధ్యమవుతుందని ఎన్నికల వేళ అగినప్పుడు.. తాను చేసి చూపిస్తానని రేవంత్ ప్రగల్భాలు పలికారని చెప్పారు. ఇప్పుడు హామీలు అమలు చేయకుండానే చేసినట్లు చెప్పుకుంటున్నారని విమర్శించారు. వేల కోట్ల విలువ చేసే భూములను ప్రైవేట్ వ్యక్తులతో కలిసి సీఎం రేవంత్ అమ్ముకుంటున్నారంటూ ఎంపీ ఈటల రాజేందర్ సంచలన ఆరోపణలు చేశారు.


# సీఐడీ ముందుకు పాడి కౌశిక్ రెడ్డి.. విచారణ ప్రారంభం

హైదరాబాద్,

బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సీఐడీ ముందు విచారణకు హాజరయ్యారు. ఈరోజు(శనివారం) హైదరాబాద్‌లోని సీఐడీ కార్యాలయానికి ఎమ్మెల్యే చేరుకున్నారు. కౌశిక్ రెడ్డితో పాటు ఆయన సతీమణికి కూడా సీఐడీ నోటీసులు ఇచ్చింది. దీంతో ఎమ్మెల్యే భార్య కూడా సీఐడీ విచారణకు హాజరయ్యారు. ఎమ్మెల్యేను సీఐడీ డీఎస్పీ రంగస్వామి విచారిస్తున్నారు. జనవరి 29న సమక్క - సారలమ్మ జాతర సందర్భంగా హుజురాబాద్‌లో కౌశిక్ రెడ్డి రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేసిన విషయం తెలిసిందే. దీంతో శాంతిభద్రతలకు విఘాతం కలిగించారంటూ ఎమ్మెల్యేపై కేసు నమోదు అయ్యింది. ఈ కేసును ప్రభుత్వం సీఐడీకి బదిలీ చేయగా.. విచారణకు రావాల్సిందిగా కౌశిక్ రెడ్డికి సీఐడీ అధికారులు నోటీసులు జారీ చేశారు. అందులో భాగంగానే ఈరోజు ఆయన సీఐడీ ముందు విచారణకు వచ్చారు.

### అందుకే విచారణకు వచ్చా: పాడి కౌశిక్ రెడ్డి

సీఐడీ కార్యాలయం వద్ద పాడి కౌశిక్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. 'నా నియోజకవర్గంలో డంపింగ్ యార్డ్ నిర్మాణంపై ఇవాళ నిరసన చేపడతామని అనుకున్నాను. నన్ను హుజురాబాద్ వెళ్లనివ్వకుండా నోటీసులు ఇచ్చి కావాలనే విచారణకు పిలిచారు. నాతో పాటు నా సతీమణికి సీఐడీ అధికారులు ఎందుకు నోటీసులు ఇచ్చారో అర్థం కావడం లేదు. సీఐడీ నోటీసులు ఇవ్వాల్సి వస్తే 108 సార్లు ఫైరింగ్ జరిపిన కరీంనగర్ సీపీకి ఇవ్వాలి. చట్టాన్ని గౌరవించాలి కాబట్టి నేను సీఐడీ విచారణకు హాజరయ్యాను' అని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వెల్లడించారు.



# క్యాంపు కార్యాలయంపై దాడిని పోలీసులు ఎందుకు అడ్డుకోవట్లేదు?: హరీశ్ రావు

హైదరాబాద్: న్యూస్‌వార్ ప్రతినిధి

కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాలపై దాడులు జరగడం సిగ్గుచేటని బిఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. ముమ్మాటికి ఇది ప్రజాస్వామ్యంపై సిఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో చేయించిన దాడి జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. క్యాంపు ఆఫీసులో రేవంత్ రెడ్డి ఫొటో పెట్టి, కాంగ్రెస్ కు అనుకూలంగా నినాదాలు చేశారని విమర్శించారు. గజ్వేల్ లో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ క్యాంపు ఆఫీసుపై కాంగ్రెస్ నేతల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. క్యాంపు ఆఫీసుపై దాడులు చేస్తుంటే శాంతిభద్రతలు ఉన్నట్టా.. లేనట్టా? క్యాంపు కార్యాలయంపై దాడిని పోలీసులు ఎందుకు అడ్డుకోవట్లేదు? హరీశ్ రావు ప్రశ్నించారు. సిఎం, మంత్రులు ఇతర రాష్ట్రాల్లో పొలిటికల్ టూర్లు చేస్తూ.. పాలనను గాలికి వదిలేశారా? బిఆర్ఎస్ ఎమ్మెల్యేల ఆఫీసులపై దాడులు చేయాలని సందేశాలు ఇచ్చారా? అని నిలదీశారు. క్యాంపు ఆఫీసుపై దాడులు జరిపిన వారిని గుర్తించి వెంటనే పోలీసులు అరెస్టు చేయాలని హరీశ్ రావు కోరారు.

# కేరళలో శశి థరూర్ కాన్వాయ్‌పై దాడి..

తిరువనంతపురం: న్యూస్‌వార్ ప్రతినిధి

కేరళలో కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ కాన్వాయ్ పై దాడి జరిగింది. త్వరలో జరగనున్న రాష్ట్ర అసెంబ్లీ నేపథ్యంలో ఆయన శుక్రవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు కేరళకు వచ్చారు. ఈ క్రమంలో నిన్న రాత్రి మలప్పురం జిల్లాలో శశి థరూర్ కాన్వాయ్ పై కొందరు దాడికి పాల్పడ్డారు. ఏపీ అనిల్ కుమార్ తరపున ప్రచారం చేసేందుకు థరూర్ వాండూర్ వచ్చిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. బైక్‌లపై వచ్చిన కొందరు వ్యక్తులు థరూర్ కాన్వాయ్‌ను వెంబడించి, ఆయన కారుపై దాడి చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దుండగులు, థరూర్ ను దూషిస్తూ, ఆయనపై దాడికి యత్నిస్తుండగా... గన్‌మెన్ అడ్డుపడ్డారు. దీంతో గన్‌మెన్‌ను కూడా అసభ్య పదజాలంతో దూషించి, ఆ తర్వాత అతనిపై దాడి చేసినట్లు సమాచారం. ఈ ఘటనపై గన్‌మెన్ వాండూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వాండూర్



పరిధిలోని 'చెల్లితోడ్' వద్ద రాత్రి సుమారు 7 గంటల సమయంలో ఈ ఘటన జరిగినట్లు తెలిస్తోంది. మరిన్ని కనుగొనండి ఇంటర్ పరీక్షల గైడ్‌లు వార్తల ఆర్కైవ్స్ లైఫ్ స్టైల్ చాశ్రీంశీ =ఘుం - రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేయాలని రేవంత్ రెడ్డి చూస్తున్నారు: సబితా చాంజవతీఅంవఎవత్ శశి థరూర్ కారును అడ్డుకున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. అరెస్టు అయిన యువకుడిని కలికావుకు చెందిన 'ఉమర్'గా గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించి మరో ఇద్దరు వ్యక్తులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. థరూర్ వాహనాన్ని అడ్డుకున్న దుండగులు ప్రయాణించిన రెండు కార్లను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ దాడి వెనుక ఏదైనా రాజకీయ కుట్ర ఉందా? అనే కోణంలో విచారిస్తున్నారు. దాడికి పాల్పడిన దుండగులు కావాలనే గొడవ సృష్టించేందుకు ప్రయత్నించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రస్తుతం అనుమానితులను పోలీసులు విచారిస్తున్నారు.

న్యూస్ వార్
వార్తా పత్రిక

సంపాదకీయం...

## తెలంగాణ ఎగుమతులకు యుద్ధం సెగ

**పశ్చిమాసియా యుద్ధ బీభత్సం అంతర్జాతీయ సరఫరా గొలుసులను చిన్నాభిన్నం చేసి చమురు, గ్యాస్ ఇతర కీలక అవసరాలు ఎవరికీ అందకుండా ఎంత కల్లోలం సృష్టిస్తోందో తెలిసిందే. భారతదేశం నుంచి ఇతర దేశాలకు ఎగుమతి కావలసినవి కాకుండా ఆటంకాలు ఏర్పడి ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తోంది. ఈ నేపథ్యంలో తెలంగాణ నుంచి అమెరికా, యుఎఇ, సౌదీ అరేబియా, తదితర దేశాలకు ఎగుమతులు స్తంభించిపోతున్నాయి. దీంతో ఎగుమతిదారులకు ఏం చేయాలో దిక్కుతోచడం లేదు. ఇతర దేశాలతో ముడిపడి ఉన్న మార్కెట్ వ్యవస్థ తలకిందులవుతోంది. తెలంగాణ నుంచి ఇతర దేశాలకు సంబంధించి మొత్తం పది ప్రధాన ఎగుమతి గమ్యస్థానాలలో అయిదు ప్రస్తుతం గందరగోళానికి గురవుతున్నాయి. అమెరికా, సౌదీ అరేబియా, కువైట్, బంగ్లాదేశ్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాలకు ఇప్పుడు తెలంగాణ నుంచి కీలకమైన పరికరాలు ఎగుమతికాక స్తంభించిపోతున్నాయి. అత్యధికంగా ఎగుమతి జరిగే ప్రధాన దేశాల్లో అమెరికా 23.64 శాతం, యుఎఇ 11.74 శాతం, సౌదీ అరేబియా 6.74 శాతం వరకు ఎగుమతి వాణిజ్యంలో పాలుపంచుకుంటున్నాయి. ఇంకా చైనా 3.69 శాతం, ఫ్రాన్స్ 3.38 శాతం, బ్రిటన్ 2.72 శాతం, టర్కీ 2.32 శాతం, జెక్ రిపబ్లిక్ 1.95 శాతం, బంగ్లాదేశ్ 1.83 శాతం, కువైట్ 1.75 శాతం వరకు తెలంగాణతో వాణిజ్యం సాగిస్తున్నాయి. ఇప్పుడు ఈ దేశాలన్నీ యుద్ధ సంక్షోభంతో వాణిజ్య ఒప్పందాల్లో అనిశ్చితిని ఎదుర్కొంటున్నాయి. ఇంతవరకు ప్రతికూలతలు ఉన్నప్పటికీ, తెలంగాణ ఎగుమతుల పనితీరు పటిష్టంగానే సాగింది.**

2023 24లో రూ. 1,16,182 కోట్ల విలువైన సరకుల ఎగుమతులు జరగ్గా, 202425లో రూ. 1,61,843 కోట్ల విలువైన ఎగుమతులు జరిగి 39.3 శాతం ఆధిక్యాన్ని చూపించాయి. అమెరికా సాంకేతికతపై ఇరాన్ సవాలు దీంతోపాటు వ్యవసాయ ఉత్పత్తులు, ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలు చెప్పుకోదగిన విధంగా ఎగుమతులు అవుతున్నాయి. వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించి 500 రిజిస్టర్డ్ ఎగుమతిదారులు తెలంగాణలో ఉన్నారు. అయినప్పటికీ ప్రస్తుత సంక్షోభంతో గల్ఫ్‌దేశాలకు, ఇతర దేశాలకు ఎగుమతులు తగ్గుముఖం పడుతున్నాయి. వాణిజ్య ఒప్పందాలు ఇంకా ఖరారు కాకపోవడమే ప్రధాన కారణంగా అగ్రికల్చరల్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడెక్ట్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎపిఇడిఎ) వెల్లడించడం గమనార్హం. నీతి ఆయోగ్ ఎక్స్‌పోర్టు సన్నాహక సూచిక 2024 ప్రకారం ఎగుమతుల్లో అన్ని రాష్ట్రాల కన్నా మొత్తం మీద తెలంగాణ ఎనిమిదో స్థానం వహించింది. లాజిస్టిక్స్ అండ్ సేఫ్టీ 2024 రిపోర్టు ప్రకారం తెలంగాణ ఎచీవర్స్ కేటగిరీలో ఉంది. అయితే రవాణా ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడంతో తీవ్ర అస్థిరతకు దారితీస్తోందని ఎగుమతిదారులు చెబుతున్నారు. తలకు మించిన భారంతో యూరప్ మీదుగా గల్ఫ్‌దేశాలకు నౌకల ద్వారా రవాణా చేస్తుండడం తమకు కష్టం అవుతోందని కొందరు చెబుతున్నారు. పశ్చిమాసియాలో సాధారణ పరిస్థితి ఏర్పడితేనే కానీ తమకు వెసులుబాటు లభించదని అంటున్నారు. ఇతర ఎగుమతిదారులు విమాన రవాణా ఛార్జీలు భరించలేక పోవడంతో ఇప్పుడు తమకు ఎగుమతి ఆర్డర్లు ఎక్కువగానే వస్తున్నాయని పేర్కొన్నారు. హోర్ముజ్ జలసంధి ద్వారా నౌకల రాకపోకలకు నిర్బంధం ఉండడంతో ఇతర విభాగాలపై కూడా ఈ ప్రభావం కనిపిస్తోంది. దుబాయ్, సౌదీ అరేబియా, కువైట్ దేశాలకు ఎగ్ పౌడర్, ఫ్రోజెన్ ఎగ్ లిక్విడ్ ఎగుమతి చేయడానికి ఇదివరకటిలా నౌకలు లభించడం లేదని దాంతో రవాణా ఛార్జీల భారం పెరిగిపోతోందని కొందరు ఎగుమతిదారులు ఆందోళన వెలిబుచ్చారు. హైదరాబాద్ కేంద్రంగా చాక్లెట్‌లు రవాణా చేసేవారు తమకు గతం కన్నా ఆర్డర్లు తగ్గాయని చెప్పారు. ఇక పెట్రోలు నుంచి వెలువడే ఉప ఉత్పత్తులతో రసాయనాలు, ఎరువులు తయారు చేసే సంస్థలు తగిన ఉత్పత్తి చేయలేక మూతపడుతున్నాయి. ఫార్మాక్యూటికల్, సెమీకండక్టర్లు, డిటెర్జంట్, రంగులు, ప్లాస్టిక్స్ వంటి ఉత్పత్తుల తయారీకి కూడా ఆటంకం ఏర్పడుతోంది. దేశంలోని ఎరువుల ఉత్పత్తి గత నెల రోజుల్లో నాలుగో వంతు పడిపోయింది. ఇంధనం కొరతతో సూరత్ లోని వస్త్రాల తయారీ యూనిట్లు వారానికి ఐదు రోజులే పనిచేస్తున్నాయి. గుజరాత్ లోని సిరామిక్ హబ్‌గా ఉన్న మోర్జీలో మూడింట ఐదు వంతుల మంది కార్మికులు తమ పనులు సాగక ఇళ్లకు తిరిగి వచ్చేస్తున్నారు. సిరామిక్ బట్టీలను మండించడానికి ఉపయోగించే ప్రొపేన్ కొరతగా ఉండడమే దీనికి కారణంగా దీనికి కారణం. ఎల్‌పిజి గ్యాస్ లేక పెద్దపెద్ద రెస్టారెంట్లు, హోటళు మూతపడుతుండడం ప్రతిచోటా చూస్తున్నదే. గ్యాస్ సిలిండర్లకు వాస్తవానికి కొరత లేదని, అనవసరంగా ఆందోళనతో బారులు తీరి నిరీక్షించనక్కర లేదని ప్రభుత్వం ఎంత గట్టిగా చెబుతున్నా కృత్రిమ కొరత తప్పడం లేదు. బ్లాక్‌మార్కెట్‌లో అసలు ధరకు మూడింతలు ఎక్కువ



చేసి విక్రయించడం పరిపాటి అవుతోంది. యుద్ధం మరికొన్ని వారాలు కొనసాగితే పరిస్థితి ఇంకా దారుణంగా మారుతుంది. అప్పుడు రేషనింగ్ చివరి మార్గం కావచ్చు. కొవిడ్ మహమ్మారిలా నిజంగానే అలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైతే ప్రపంచ దేశాలు ఒకరికి మరొకరు సహకరించుకోవడం, నిల్వలు అధికంగా ఉన్నవారు తోటి వారికి పంపిణీ చేయడం వంటి సమష్టి కార్యాచరణ పాటించక తప్పదు.

# ఇరిగేషన్ అధికారులు తీరు మార్చుకోవాలి

### గత ప్రభుత్వంలో లాగా చేస్తామంటే కుదరదు

### సిఈలతో వీడియో కాన్ఫరెన్స్ లో మంత్రి నిమ్మల రామానాయుడు

**అమరావతి**



గతంలో ప్రభుత్వంలో వ్యవహరించినట్లుగా కాకుండా, ఇరిగేషన్ అధికారులు తీరు మార్చు కోవాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు హెచ్చరించారు . శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సిఈలతో వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడిన మంత్రి నిమ్మల నియోజకవర్గాల వారీగా కాలువల్లో తూడు, గుర్రపుడెక్క, పూడికతీత, వంటి పనులకు సంబందించిన అంచనాల తయారీపై సమీక్ష నిర్వహించారు. ఆయా పనులకు సంబందించి మార్చి 25వ తేదీలోపు నియోజకవర్గాల వారీగా అంచనాలు రూపొందించి పంపించాలని ఆదేశించినా, ఇప్పటివరకు కొంత మంది చీఫ్ ఇంజనీర్లు సరిగా అంచనాలు సమర్పించకపోవడంతో మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలువల్లో తూడు, గుర్రపుడెక్క, మట్టి పూడిక తీత వంటి పనులు చేయడానికి ఏప్రియల్, మే, నెలలో మాత్రమే అవకాశం ఉంటుంది. ఆతరువాత ఖరీఫ్ సీజన్ మొదలైతే పనులు చేయడానికి అవకాశం ఉండదని, గతంలో ఏప్రియల్, మే నెలలో చేయాల్సిన పనులకు జూన్ లో అనుమతులు ఇచ్చేవారని, పనులు మొదలుపెట్టిన వెంటనే కాలువలకు నీళ్ళు వదిలేవారని, దీంతో పనులు సగంలోనే వదిలేయాల్సి వచ్చేదని గుర్తు చేశారు. ఇలా చేయడం వల్ల ఆయకట్టు చివరన ఉన్న పొలాలకు సాగు నీరందక రైతులు ఇబ్బంది పడాల్సి వస్తుందని, ఇలా గతంలో వ్యవహరించిన తీరులో కాకుండా ముందుగానే అంచనాలు రూపొందించి, ఆర్దిక శాఖ అనుమతులు పొందితే సీజన్ మొదలయ్యేలోగా పనులు కూడా పూర్తి చేయడానికి అవకాశం ఉంటుందని అన్నారు. కావున నియోజకవర్గాల వారీగా పనులకు సంబందించిన అంచనాలను ఆదివారం సాయంత్రం లోగా పంపాలని సిఈలను ఆదేశించారు. గడువులోగా అంచనాలను పంపని అధికారులు సోమవారం అమరావతి సచివాలయంకు వచ్చి అంచనాలు ఎందుకు పంపలేకపోయారో సంజాయిషీ ఇచ్చుకోవలసి ఉంటుందని తీవ్రంగా మంత్రి నిమ్మల రామానాయుడు హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అత్యవసర పనుల కింద నిధులు విడుదల చేసి, కాలవల్లో పూడిక తీత, తూడు, గుర్రపుడెక్క తొలగింపు వంటి పనులను చేయడం ద్వారా ఆయకట్టు రైతులకు సాగునీరందించగలిగామని తెలిపారు. గత 5ఏళ్ళ వైసిపి ప్రభుత్వ పాలనలో కనీస నిర్వహణ పనులు సైతం పట్టించుకోకపోవడంతో ఆయకట్టు చివరి ఎకరం వరకు నీరందక రైతులు ఇబ్బంది పడ్డారని, నేడు కూటమి ప్రభుత్వం ప్రతి ఎకరాకు సాగు నీరందించడమే లక్ష్యంగా పెట్టుకుని పని చేస్తున్నామని స్పష్టం చేశారు. కావున అధికారులు నిర్లక్ష్యం వదిలి గడువులోగా ఇరిగేషన్ పనులకు సంబందించిన అంచనాలు సమర్పించి, సీజన్ మొదలయ్యేలోగా, నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

## వరంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై ఏసీబీ

### ఇద్దరు సబ్‌రిజిస్ట్రార్ల నుంచి అక్రమాలపై ఆరా

### తనిఖీల్లో అక్రమ లావాదేవీలు, లంచాలు గుర్తింపు

### భారీగా నగదు, నగలు, అనేక డాక్యుమెంట్లు స్వాధీనం

**వరంగల్,**

వరంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై ఏసీబీ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా నగదు, డాక్యుమెంట్లు ఇద్దరు సబ్ రిజిస్ట్రార్ల నుంచి స్వాధీనం చేసుకున్నారు. సబ్ రిజిస్ట్రార్-1 జమాలపురం రామనరసింహరావు, రిజిస్ట్రార్-2 దేవులూరి ఆనంద్ ఫోన్లను స్వాధీనం చేసుకుని పరిశీలించారు. ఇద్దరు అధికారులు డాక్యుమెంట్ రైటర్లతో జరిపిన ఫోన్ పే పరిశీలించగా సుమారు రూ.42 లక్షలు లావాదేవీలు జరిపినట్లు గుర్తించారు. వీరి వద్ద నుంచి 70 రిజిస్ట్రేషన్ కాని డాక్యుమెంట్లను పరిశీలించారు. అదే విధంగా ఇద్దరు ఇళ్ల నుంచి రూ.24.61 లక్షల నగదును, 819.500 గ్రాముల బంగారు ఆభరణాలను, 2.600 కిలో గ్రాముల వెండి ఆభరణాలను, రూ.30 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్లను గుర్తించారు. ఆదాయానికి మించి ఆస్తులున్నట్లు గుర్తించి ప్రభుత్వానికి పంపనున్నట్లు వెల్లడించారు. వరంగల్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అవినీతి అక్రమాలపై అవినీతి నిరోధక శాఖ అధికారులకు ఫిర్యాదులు అందడంతో మెరుపు దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సబ్ రిజిస్ట్రార్ల అక్రమ లావాదేవీలు, అనధికారిక వ్యక్తులతో వారు సాగిస్తున్న చీకటి ఒప్పందాలు వెలుగులోకి వచ్చాయి. సబ్ రిజిస్ట్రార్లయిన జమాల్పూర్ రామ్ నర్సింహారావు, దేవులూరి ఆనంద్ తమ కార్యాలయంలో ఇద్దరు వ్యక్తులను అనధికారికంగా డాక్యుమెంట్ రైటర్లుగా నియమించుకున్నట్లు ఏసీబీ గుర్తించింది. వీరిద్దరూ డాక్యుమెంట్ రైటర్లతో కలిసి రిజిస్ట్రేషన్ల పేరుతో భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారు. కేవలం ఈ అనధికారిక రైటర్లు పంపిన పత్రాలను మాత్రమే వీరిద్దరు ప్రాధాన్యత ఇచ్చి రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు తేలింది. కార్యాలయంలో పూర్తి కాని సుమారు 70 డాక్యుమెంట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సబ్ రిజిస్ట్రార్లు, డాక్యుమెంట్ రైటర్ల మధ్య జరిగిన ఆర్థిక లావాదేవీలు వాట్సాప్ చాట్ ద్వారా బట్టబయల య్యాయి. గత ఏడాది కాలంలోనే డాక్యుమెంట్ రైటర్ల ద్వారా ఈ ఇద్దరు అధికారులు సుమారు రూ. 42 లక్షలను లంచంగా తీసుకున్నట్లు ఏసీబీ ఆధారాలు సేకరించింది. కార్యాలయంలో సోదాల అనంతరం ఏసీబీ బృందాలు ఇద్దరి నివాసాల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టాయి. వీరి ఇళ్లలో లక్షలాది రూపాయల నగదుతో పాటు భారీగా అక్రమ ఆస్తులకు సంబంధించిన పత్రాలను అధికారులు కనుగొన్నారు. ఇక్కడ ఓ షాకింగ్ అంశం వెలుగులోకి వచ్చింది. ఓ అధికారి ఇంట్లో రిజిస్ట్రేషన్ చేయని 254 ప్రభుత్వ పత్రాలు లభించడం అధికారులను సైతం విస్మయానికి గురిచేసింది. ప్రభుత్వ కార్యాలయంలో ఉండాల్సిన పత్రాలు అధికారుల ఇళ్లలో ఎందుకు ఉన్నాయనే కోణంలో ఏసీబీ దర్యాప్తు చేస్తోంది. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి, సామాన్యులను ఇబ్బందులకు గురిచేస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఈ ఇద్దరు అధికారులపై ఏసీబీ కేసులు నమోదు చేసింది. ప్రస్తుతం స్వాధీనం చేసుకున్న నగదు, డాక్యుమెంట్లు, డిజిటల్ ఆధారాలను పరిశీలిస్తున్నారు.

## బిజెపితో చేతులు కలిపిన రాఘవ్ చద్దా

### పంజాబ్ సిఎం భగవంత్ మాన్ విమర్శలు

**చండీఘడ్,**

రాజ్యసభ ఎంపీ, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నేత రాఘవ్ చద్దాపై ఆ పార్టీ విమర్శల బాణం ఎక్కుపెట్టింది. చద్దాకు వ్యతిరేకంగా ఆప్ నేతలు వరుసగా స్పందిస్తున్నారు. ఆయన బీజేపీతో చేతులు కలిపారని ఆరోపిస్తున్నారు. రాజ్యసభలో ఆప్ డిప్యూటీ లీడర్‌గా ఉన్న రాఘవ్ చద్దాను ఆ బాధ్యతల నుంచి ఆప్ తొలగించింది. ఈ నేపథ్యంలో రాఘవ్ చద్దాకు, ఆమ్ ఆద్మీ పార్టీకి మధ్య మాటలయుద్ధం ప్రారంభమైంది. ఒకరిపై ఒకరు పరస్పర విమర్శలు చేసుకుంటున్నారు. తనను పదవి నుంచి తొలగించగలరేమో కానీ, ఓడించలేరని రాఘవ్ చద్దా అన్నారు. అయితే, ఆయనపై ఆప్ ఎదురుదాడికి దిగింది. పంజాబ్ సీఎం భగవంత్ మన్ కూడా చద్దాపై విమర్శలు గుప్పించారు. బీజేపీతో రాఘవ్ చద్దా చేతులు కలిపారని, ఇది ఆమ్ ఆద్మీ పార్టీలో ఆందోళన కలిగించిందని భగవంత్ మన్ అన్నారు. రాజ్యసభలో లేవనెత్తాల్సిన అంశాలపై ఆప్ సూచించే విషయాల్ని చద్దా పాటించలేదన్నారు. రాజ్యసభలో ప్రజల సమస్యలపై ప్రశ్నించమంటే, చద్దా మాత్రం సమోసాలపై ప్రశ్నించారని ఎద్దేవా చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో తప్పకుండా ఏ పార్టీ అయినా చర్య తీసుకుంటుందన్నారు. మరో సీనియర్ ఆప్ లీడర్ సౌరభ్ భరద్వాజ్ కూడా రాఘవ్ చద్దాపై మండిపడ్డారు. చద్దాకు వీలైతే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్పందించాలని కోరారు. పంజాబ్, దేశం ఎదుర్కొంటున్న సమస్యలపై చద్దా ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. రాఘవ్ కొన్నేళ్లుగా భయపడుతున్నారని, మోదీకి వ్యతిరేకంగా మాట్లాడలేకపోతున్నారని విమర్శించారు. సభలో మాట్లాడేందుకు దొరికే కొద్దిపాటి సమయంలో దేశం గురించి మాట్లాడాలని సూచించారు. చద్దా తీరుతో ఆప్ కార్యకర్తలు అసంతృప్తితో ఉన్నారని వ్యాఖ్యానించారు.

## ఎమ్మెల్యే అరవింద్ బాబుపై సిఎం సీరియస్

### పార్టీ కార్యాలయంలో చర్చించిన అధ్యక్షుడు పల్లా

**అమరావతి,**

: పల్నాడు జిల్లా నరసరావుపేట ఎమ్మెల్యే అరవింద బాబుపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సీరియస్ అయ్యారు. పార్టీ పరువుకు భంగం కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఇటీవల తాను చెప్పిన వ్యక్తికి లీగల్ అడ్వైజర్ పోస్ట్ ఇవ్వలేదని అరవింద బాబు హల్ చల్ చేశారు. ఏకంగా పల్నాడు జిల్లా ఎస్పీ కార్యాలయంలో బైఠాయించి నిరసన తెలిపారు. ఈ విషయం కాస్తా పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు దృష్టికి వెళ్లింది. ఎమ్మెల్యేతో మాట్లాడాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయానికి అరవింద బాబును పల్లా శ్రీనివాసరావు పిలిపించారు. ఎస్పీ కార్యాలయంలో బైఠాయించడంపై వివరణ కోరారు. ఘటనపై టీడీపీ అధినేత చంద్రబాబు అసంతృప్తిగా ఉన్నారని.. ఇది ఎంతమాత్రం సహించరాని విషయమని అరవింద బాబుకు పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. లీగల్ అడ్వైజర్ నియామకం జరగకపోతే పార్టీ జిల్లా అధ్యక్షుడు, రీజనల్ కోఆర్డినేటర్ లేదా తన దృష్టికి ఎందుకు తీసుకురాలేదని ఎమ్మెల్యేను ప్రశ్నించారు. అంతేకాని ఇలా పార్టీ పరువుపోయేలా ప్రవర్తించడం ఏంటని నిలదీశారు. సందర్భంగా ఎస్పీ కార్యాలయంలో బైఠాయించడం, పార్టీ పరువుకు భంగం కలిగించే ప్రయత్నాలను ఖండించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే పార్టీ తరఫున తీవ్ర చర్యలు తీసుకునేందుకు వెనుకాడేది లేదని తేల్చిచెప్పారు. అయితే, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా చూసుకుంటానని ఎమ్మెల్యే అరవింద బాబు హామీ ఇచ్చారు.

## మంచిర్యాలలో ఫేక్ నోట్ల కలకలం

### దొంగనోట్లు చలామణి చేస్తున్న ముఠా అరెస్ట్

**మంచిర్యాల,**

జిల్లాలో దొంగ నోట్ల వ్యవహారం కలకలం రేపింది. ఫేక్ కరెన్సీని నిర్మూలించాలని ఎన్ని చర్యలు తీసుకుంటున్నా వాటి చలామణి మాత్రం ఆగడం లేదు. కొత్తకొత్త ప్లాన్లు వేస్తూ పోలీసులనే బురిడీ కొట్టించే ప్రయత్నం చేస్తున్నారు కేటుగాళ్లు. తాజాగా దొంగనోట్లు చెలామణి చేస్తూ అడ్డంగా బుక్కయ్యారు ఓ ముఠా సభ్యులు. వారి గుట్టురట్టు చేసి కటకటాల వెనక్కి పంపారు పోలీసులు. నిందితుల నుంచి లక్షల రూపాయల ఫేక్ నోట్లు స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. మంచిర్యాల జిల్లాలో ఫేక్ నోట్లు చెలామణి చేస్తున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. ఫిబ్రవరి 25న ఓ పెట్రోల్ బంకులో మూడు రూ.500 నోట్లు ఇచ్చారు ముఠా సభ్యులు. నోట్లపై ఒకే సీరియల్ నంబర్ ఉండడంతో అనుమానం వచ్చి పోలీసులకు బంక్ సిబ్బంది ఫిర్యాదు చేశారు. తీగ పట్టుకుని లాగగా డొంక మొత్తం కదిలింది. ప్రధాన సూత్రధారి కానుగంటి క్రాంతి సహా 13 మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.5,98,500లు స్వాధీనం చేసుకున్నారు. 12 సెల్ ఫోన్లు, మూడు వాహనాలు సీజ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కాకినాడలో తెలిసిన పరిచయాల ద్వారా ఫేక్ నోట్లను కేటుగాళ్లు చలామణి చేస్తు?న్నట్లు పోలీసులు గుర్తించారు. ఈజీ మనీ కోసమే ఫేక్ కరెన్సీని చలామణి చేస్తున్నట్లు విచారణలో తేలింది. వారందరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## మేడారంలో తీవ్ర విషాదం

### రాతి కట్టడం కూలి బాలుడికి గాయాలు

### ఆస్పత్రి తీసుకెళ్లగా కాలు తీసేసిన వైద్యులు

**ములుగు,**

ప్రముఖ పుణ్యక్షేత్రం మేడారంలో తీవ్ర విషాదం నెలకొంది. ఊహించని రీతిలో జరిగిన ప్రమాదం.. ఒక చిన్నారి జీవితంలో చీకటిని నింపింది. మేడారం పూజారి సిద్ధబోయిన రమేశ్ కుమార్ కొడుకు యువన్‌పై ఒక్కసారిగా రాతి కట్టడం కూలి పడటంతో ఈ దారుణం జరిగింది. వెంటనే తల్లిదండ్రులు చిన్నారిని ఆసుపత్రికి తరలించారు. బాలుడు యువన్ ఆడుకుంటున్న సమయంలో సమీపంలోని ఒక రాతి కట్టడం ఒక్కసారిగా అతడిపై పడింది. ఈ ప్రమాదంలో బాలుడి కాలికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే యువన్ తల్లిదండ్రులు, స్థానికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. బాలుడిని తల్లిదండ్రులు హుటాహుటిన సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. గాయం తీవ్రంగా ఉండటంతో ఇన్ఫెక్షన్ సోకకుండా ఉండేందుకు తప్పనిసరి పరిస్థితుల్లో కాలును తొలగించాల్సి వచ్చిందని వైద్యులు తెలిపారు. తమ కళ్ల ముందు ఆడుకోవాల్సిన బిడ్డ.. ఇలా కాలు కోల్పోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఆస్పత్రి ప్రాంగణంలో వారి ఆవేదన చూసి స్థానికులు సైతం చలించిపోయారు.

న్యూస్ వార్
వార్తా పత్రిక

# రసాయన శాస్త్రంలో నాగులంచ భుజంగరావుకు పీహెచ్.డీ.

హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి భుజంగరావు నాగులంచ డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'ఆర్పీ-యూపీఎల్సీ, ఎల్సీ-ఎంఎస్ మరియు ఎల్సీ-ఎంఎస్/ఎంఎస్ విధానాల ద్వారా ఔషధ మోతాదు రూపాలలో జన్యు విష మలినాలు, ఐసోమర్లు, విఘటన ఉత్పత్తులను అంచనా వేయడానికి, స్థిరత్వాన్ని సూచించే పద్ధతుల అభివృద్ధి, ధ్రువీకరణ'పై ఆయన సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వి.కోటేశ్వరరావు శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఔషధాలలో ఉండే మలినాలను కచ్చితంగా విశ్లేషించడానికి, పటిష్టమైన, నియంత్రణ ప్రమాణాలకు అనుగుణంగా ఉండే విశ్లేషణా పద్ధతులను అభివృద్ధి చేయడంపై ఈ అధ్యయనం దృష్టి సారించినట్టు తెలియజేశారు. కచ్చితత్వం, సున్నితత్వం, విశ్వసనీయతను నిర్ధారించడానికి- ఈ అధ్యయనంలో యూపీఎల్సీ, ఎల్సీ-ఎంఎస్, మరియు ఎల్సీ-ఎంఎస్/ఎంఎస్ వంటి అధునాతన సాంకేతికతలతో పాటు విశ్లేషణాత్మక రూపకల్పన ద్వారా నాణ్యత (క్యూబీడీ), ప్రయోగాల రూపకల్పన (డీఓఈ)లను కూడా ఉపయోగించినట్టు వివరించారు. ఈ పరిశోధన, బలోక్సావిర్ మార్బాక్సిల్, గ్లిపిజైడ్, క్లోర్ జోక్సాజోన్, అబ్రోసిటినిబ్, సెర్ట్రాలిన్ వంటి కీలక ఔషధాలలో మలినాల విశ్లేషణపై దృష్టి సారించిందని తెలిపారు. ఇది అతి తక్కువ స్థాయిలో ఉండే జన్యు విషపూరిత మలినాలను, విచ్ఛిన్న ఉత్పత్తులను సమర్థవంతంగా గుర్తించడానికి వీలు కల్పించడం ద్వారా, ఔషధ నాణ్యత, భద్రతను మరింత పటిష్టం చేసిందన్నారు. డాక్టర్ భుజంగరావు సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర గౌసియా బేగం, పలు విభాగా ల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు..



# ఘనంగా కెఎల్‌హెచ్ గ్లోబల్ బిజినెస్ స్కూల్ ప్లేస్‌మెంట్ మీట్



కెఎల్‌హెచ్ గ్లోబల్ బిజినెస్ స్కూల్(కెఎల్‌హెచ్ జీబీఎస్) ప్లేస్‌మెంట్ విజయోత్సవ సమావేశాన్ని నగరంలో ఘనంగా నిర్వహించినట్లు కెఎల్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ ఉపాధ్యక్షుడు ఎర్.కొనేరూ లక్ష్మణ హవిష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ఈ ఘట్టం విశ్వవిద్యాలయం కేవలం ఉద్యోగ అవకాశాలకే కాకుండా, భవిష్యత్తుకు సిద్ధమైన ధైర్యవంతులైన వ్యక్తులను తీర్చిదిద్దే కట్టుబాటును ప్రతిబింబిస్తోందని అన్నారు. సమగ్ర అభివృద్ధిపై దృష్టి సారిస్తూ, మారుతున్న ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. వైస్ చాన్స్‌లర్ డాక్టర్ జి.పర్ధ సారధి వర్మ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం మొత్తం మీద ఇప్పటివరకు 6300కు పైగా ప్లేస్‌మెంట్ ఆఫర్లు నమోదయ్యాయని, అందులో 4700 మందికి పైగా విద్యార్థులు ఇప్పటికే ఉద్యోగాలు పొందారని, ఇంకా నియామక ప్రక్రియ కొనసాగుతోందని వెల్లడించారు.

# 6వ తేదీన అంబేద్కర్ ఉత్సవ కమిటీ



ఏప్రిల్ 14వ తేదిన మహనీయులు డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలో 6వ తారీకు జయంతి ఉత్సవ కమిటీని ఏర్పాటు చెయ్యడం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు బెల్లంపల్లి సురేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇట్టి కమిటీని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరుగుతుంది. మండలంలోని ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ఓసి సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటయ్యే జయంతి ఉత్సవ కమిటీలో ప్రతి ఒక్కరు భాగ్యస్వాముల కావాలని అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఉదయం 11:00 గంటలకు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.

# లేక్ సిటీ కొనుగోలుదారులకు ఇన్ కార్ భరోసా

లేక్ సిటీ కొనుగోలుదారుల పట్ల తమ నిబద్ధతను చాటుకుంటూ నగరంలో శనివారం ఇన్ కార్ సంస్థ వారితో ముఖాముఖి సమావేశాన్ని నిర్వహించింది. కస్టమర్ల ఆందోళనలను వినడంతో పాటు ప్రాజెక్టు పూర్తి చేయడంపై స్పష్టమైన హామీ ఇవ్వడమే లక్ష్యంగా ఈ భేటీ సాగింది. ఇది కేవలం ఒక అధికారిక సమాచారం లాగా కాకుండా, కొనుగోలుదారుల అంచనాలు, వారి కలల ఇంటిని నిర్మించే లక్ష్యంతో కూడిన చర్చగా సాగింది. నిర్మాణంలో జరుగుతున్న ఆలస్యం వల్ల కొనుగోలుదారులకు కలిగిన ఇబ్బందులను సంస్థ అంగీకరించింది. అయితే లేక్ సిటీ ప్రాజెక్టు తమకు అత్యంత ప్రాధాన్యత కలిగినదని, దీనిని పూర్తి చేయడంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని ఇన్ కార్ స్పష్టం చేసింది. ప్రాజెక్టును పూర్తి చేయడానికి అవసరమైన బృందాలు, పెట్టుబడి, నిర్మాణ పనులు అన్నీ సమన్వయంతో ముందుకు సాగుతున్నాయని వివరించింది.

# యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల పనులను ఆకస్మిక తనిఖీ

**-పాఠశాల పనులను వేగవంతం చెయ్యాలి**

**-జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం గణపురం మండలం మైలారం గ్రామంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల పనులను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్మాణం మ్యాపు ద్వారా సమీక్షించిన కలెక్టర్, వచ్చే సంవత్సరం జూన్ నాటికి పనులు పూర్తి చేయాలని గడువు విధించారు. పనుల నాణ్యతను కాపాడుతూ నిర్దేశించిన సమయంలోగా నిర్మాణం పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. అదేవిధంగా, టిజిఈడబ్ల్యూఐడిసి అధికారులు పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎలాంటి ఆలస్యం లేకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేసి నిర్మాణం పూర్తి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రాజేందర్, టిజిఈ డబ్ల్యూఐడిసి ఈఈ అరుణ్ కుమార్, డీఈ రామకృష్ణ, ఏఈ జీవన్, కేఎంవి ప్రాజెక్టు సంస్థ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.



# నిఘా నేత్రలతోనే నేరాల అదుపు





గ్రామంల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్న సర్పంచ్ వగ్గు కిరణ్ కుమార్

:నిఘా నేత్రాలతోనే గ్రామాల్లో నేరాలను అదుపు చేయొచ్చని సర్పంచ్ వగ్గు కిరణ్ కుమార్ అన్నారు శనివారం మండల పరిధిలోని సింగారెడ్డి పాలెం, జానా రెడ్డి నగర్ తండా గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి మాట్లాడారు తాను గ్రామంలో సొంత ఖర్చులతో సీసీ కెమెరా ఏర్పాటు చేయగా మరో దాత సహకారంతో జానారెడ్డి నగర్ తండాలో కూడా సీసీ కెమెరాను ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు ఇప్పటికీ ఆయా గ్రామాల్లో దొంగల బెడద వివిధ రకాల ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయని అలాంటి వాటిని వెంటనే గుర్తించేందుకు నిఘానేత్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు ప్రతి దానికి పోలీసులపై ఆధారపడకుండా సిసి కెమెరాల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవచ్చని తెలిపారు.. గ్రామాల్లో సిసి కెమెరాను ఏర్పాటు చేసిన సర్పంచ్ను గ్రామస్తులతో పాటు, పోలీసులు పలువురు నాయకులు అభినందించారు...

# అత్యాధునిక వసతులతో ఫంక్షన్ హాల్ ప్రారంభం

హైదరాబాద్ తరహాలో అత్యాధునిక వసతులతో, సకల సౌకర్యాలతో సూర్యాపేట లో ఫంక్షన్ హాల్ ఏర్పాటు చేయడం అభినందనీయమని మాజీ మంత్రి, సూర్యాపేట శాసన సభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి, ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వర్ రావు, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాదిలు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని 11వ వార్డు పిల్లలమర్రి స్టేజి సమీపంలో రుద్రంగి ఏసీ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్ ప్రారంభించి మాట్లాడారు. జిల్లా కేంద్రం ఏర్పాటు తర్వాత సూర్యాపేట ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. నిర్వాహకులు రుద్రంగి సురేష్ మంజుల మాట్లాడుతూ పార్కింగ్, లైటింగ్, కాంపౌండ్ వాల్, అత్యాధునిక సౌకర్యాలతో అన్ని వసతులు కల్పించామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా స్వర్ణగిరి అర్చకులతో శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణం ను ఎంతో వైభవంగా నిర్వహించారు. భక్తులు,ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కళ్యాణము తిలకించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్, మాజీ రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్ మాజీ మున్సిపల్ చైర్పర్సన్ జుట్టుకొండ సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ చల్లమల్ల నర్సింహ, రమేష్, నిమ్మల శ్రీను, ఉప్పల ఆనంద్, కౌన్సిలర్ లు ఎల్గూరి ఇందిర వీరయ్య గౌడ్, గునగంటి హేమసతీష్, నాయకులు అబీద్, కక్కిరేణి శ్రీనివాస్ గుప్త తదితరులు పాల్గొన్నారు.





Edited, Printed, Published & Owned by NATAVA KRISHNA RAO, Published from: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255, Telangana, Printed at: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255,Telangana, Editor:NATAVA KRISHNA RAO, Cell: 9440991979,